క్లుప్తంగా

గొలుగొండలో గ్రామ సభ

గొలుగొండ: గ్రామ సభలో ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించనున్నట్టు సర్పంచ్ కసిపల్లి అప్పారావు తెలిపారు. మంగళవారం గొలుగొండలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి వీధిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుంత్సం లక్ష్మీనారాయణ, గాదే శ్రీనివాసరావు, పి.రమేష్, రాము పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కె.కోటపాడు : భగవాన్ శ్రీసత్యసాయిబాబా చూపిన సేవా మార్గంలో పయనించడం వల్ల మానసిక సంతృప్తి అందరికి కలుగుతుందని కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. ప్రతి మంగళవారం కె.కోటపాడులో సత్యసాయి భక్తులు నారాయణసేవలో భాగంగా పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక రామాలయంలో 33 మంది పేదలకు ఒకపూట అన్నదానం చేశారు. సత్యసాయి చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని నారాయణపాత్రుడు సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, భక్తులు జేగురపాటి భీమేష్ పాల్గొన్నారు.

ఆనందపురంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ఆటో డ్రైవర్లతో కలిసి ప్రారంభిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు : సామాజిక బాధ్యతతో ఆటో డ్రైవర్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో ఆనందపురంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆటోడ్రైవర్లతో కలిసి ఎస్ఐ ప్రారంభించారు. చలివేంద్రాల ద్వారా వేసవిలో వృద్ధులు, చిన్నారుల దాహార్తి సకాలంలో తీరనుందని ఎస్ఐ చెప్పారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై ఇంటింటా ప్రచారం

రావికమతం: ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో వాట్సప్ గవర్నెన్స్‌పై మంగళవారం ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే చేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరు 95523 00009 నంబర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన

రోలుగుంట: కొంతలం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమ బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలంటూ కేవీపీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ సుమారు 9 వారాలుగా వేతనాలు లేక లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల వద్ద మజ్జిగ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

కంటి ఆపరేషన్లకు 17 మంది విశాఖ తరలింపు

దేవరాపల్లి: దేవరాపల్లి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 17 మంది రోగులను ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన తెలిపారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ కె.భవానీ సమక్షంలో 17 మంది రోగలను ప్రత్యేక బస్సులో విశాఖపట్నంలో ప్రాంతీయ కంటి ఆస్పత్రికి తరలించామన్నారు. కంటి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపొద్దని, కంటి ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎం.ఆనంద్, పీహెచ్ఎన్ బి.సునీత, హెల్త్ సూపర్‌వైజర్ కె.పుష్పరాజ్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెయ్యిలకు గాలికుంటు నివారణకు బూస్టర్ డోస్

కె.కోటపాడు : గాలికుంటు వ్యాధి బారిన పెయ్యిలు పడకుండా ఉండేందుకు బూస్టర్ డోసును తప్పకుండా వేయాలని కె.కోటపాడు పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని పశువైద్య సహాయకులతో మంగళవారం కె.కోటపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెయ్యిలకు బూస్టర్ డోసలను ఈ నెల 30వ తేదీలోగా వేయాలన్నారు. గొర్రెల్లో చిటికెల వ్యాధి రాకుండా ఉండేందుకు ఈటీ వ్యాక్సిన్‌ను ఈ నెల 16 నుంచి 30వ తేదీలోగా వేయాలన్నారు.



ప్రమాదకరంగా ఉన్న ఖండివరం నుంచి మాడుగుల రహదారిలో మలుపు



వడ్డాది - గాదిరాయి రహదారిలో వీరవల్లి అగ్రహారం వద్ద ప్రమాదకరమైన మలుపు

మలుపుల్లో తస్మాత్ జాగ్రత్త





లక్ష్మీపురం సమీపంలో గల మలుపు

మాడుగుల రూరల్ : రోడ్లు భవనాల శాఖ పరిధిలో గల పలు రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపులు ప్రమాదానికి పిలుపులుగా మారాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ మలుపుల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా వడ్డాది నుంచి గాదిరాయి పోవు ప్రధాన రహదారి 10 కిలోమీటర్ల పొడవునా సుమారు 6 ప్రమాదకర మలుపులు ఉన్నాయి. వీరవల్లి, పీపీ అగ్రహారం, జి.అగ్రహారం మీదుగా వీరనారాయణం, గాదిరాయి వరకు రహదారి మీదుగా ప్రతి రోజు కింతలి, ఒమ్మలి, వీజే పురం, అవురువాడ తదితర గ్రామాల ప్రజలు వడ్డాది నుంచి గాదిరాయి పోవు రహదారి గుండా నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వడ్డాది నుంచి తాటిపర్తి వరకు గల 13 కిలోమీటర్లు రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో పై గ్రామాల ప్రజలు వడ్డాది గాదిరాయి రహదారి గుండా ద్విచక్రవాహనాలు, ఆటోలు మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదకరమైన మలుపులు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపులు వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయమని ఆర్అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కె.జె.పురం గ్రామం నుంచి దబ్బకుంటు రహదారి మీదుగా మాడుగుల పోవు రహదారిలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపులు వద్ద ప్రస్తుతం నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మాడుగుల మండల కేంద్రానికి చేరే వారు ఈ రహదారి గుండా నియోజకవర్గంలో కొన్ని గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో పాటు చీడికాడ మండలం ఖండివరం నుంచి మాడుగుల పోవు రహదారిలో, కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోవు రహదారిలో వడ్డాది నుంచి పాడేరు పోవు రహదారిలో తాటిపర్తి, గరికబంద, కాశీపురం, తదితర చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఇక పోతే శంకరం కృష్ణంపాలెం పోవు రహదారిలో మలుపులు వున్నాయి. దీనికి తోడు ఈ రహదారి గుండా జంగిల్ కూడా పేరుకుని ఉంది. మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సిగ్నల్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చునని ప్రజలు ఎకరువు పెడుతున్నారు. మాడుగుల నుంచి కె.యల్.బి పట్నం రహదారి గుండా నిత్యం వాహనాలు, ద్విచక్రవాహనాలు ప్రయాణాలు సాగిస్తున్నారు. కొన్ని రహదారుల గుండా అయితే జంగిల్ పేరుకుని పోయింది. వెంటనే జంగిల్ తొలగించి, మలుపుల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



మలుపులు వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి. మలుపుల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువల్ల సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

– శోలం రమేష్, సర్పంచ్
శంకరం, మాడుగుల మండలం

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి



ప్రమాదకరమైన మలుపులు వద్ద వున్న చెట్లును తొలగించాలి. దీంతో పాటు జంగిల్ తొలగింపుతో పాటు సిగ్నల్స్ ఎర్పాటు వల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ప్రస్తుతం ప్రధాన రహదారి నిర్మాణంలో వుండటం వల్ల గ్రామాలు మీదుగా పోవు రహదారిలో సిగ్నల్స్ ఎర్పాటు శ్రేయస్కరం.

– సూరిశెట్టి గోవిందరాజులు,
ఉప సర్పంచ్, కె.జె.పురం గ్రామ పంచాయతీ

ఈదురు గాలులతో వర్షం



మాడుగుల మండలం సత్యవరంలో కురుస్తున్న వర్షం



బుచ్చెయ్యపేట మండలం పెద్దేరు వంతెనపై చేరిన వర్షం నీరు

మాడుగుల: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కోత దశలో ఉన్న రబీ వరి చేలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేల రాలి పాడైపోయాయన్నారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బుచ్చెయ్యపేట: మండలంలో ఉరుములు, మెరుపులతో గాలి వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పిడుగులు పడటంతో ప్రజలు ఆందోళన చెందారు. పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. రాత్రి 8 గంటల తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు మంగళవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులు ధాటికి చీడికాడ నుంచి దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్‌కు చెందిన ఇన్సులేషన్లు ఫెయిల్ అవ్వడంతో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జిందాల్ లైన్ నుంచి విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా పునరుద్ధరించినట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ శంకరరావు తెలిపారు.

మే నెలాఖరుకు 3 లక్షల ఇళ్లు పూర్తి



మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట : రాష్ట్రంలో మే నెలాఖరుకు మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మంగళవారం ఆయన వడ్డాదిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పేద పేజలకు ఇళ్లు అందిస్తాయన్నారు. గత ప్రభుత్వంలో మధ్యలో ఆగిపోయిన ఇళ్లతో మంజూరై ప్రారంభం కాని ఇళ్లు, కొత్తగా నిర్మాణం చేపట్టే ఇళ్లకు బిల్లులు మంజూ చేస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా 5,98,710 మందికి ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న జర్నలిస్టులందరికి ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ముఖ్యమంత్రి, హౌసింగ్‌శాఖ మంత్రి పార్థసారథితో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండా నరేష్, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ టాపర్లకు నగదు పురస్కారం



కళాశాల టాపర్లకు నగదును అందించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగమణి

కె.కోటపాడు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మంచి ఫలితాలను సాధించామని కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువులు సాగించి టాపర్లుగా నిలిచిన ఇద్దరు విద్యార్థినులకు మంగళవారం ఆమె తన సొంత నగదును అందించి అభినందించారు. బైపీసీలో 959 మార్కులతో టాపర్‌గా నిలిచిన పి.హాసిని, సీఈసీలో 910 మార్కులు సాధించిన ఎం.పద్మలకు రూ.1000 చొప్పున ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజంనాయుడు, ప్రసాద్, తిరుపతినాయుడు, తనూజారాణి పాల్గొన్నారు.

వెదురు సాగుపై మహిళా రైతులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రభాకర్

దేవరాపల్లి: వెదురు సాగుపై మహిళా రైతులు దృష్టి సారించాలని దేవరాపల్లి వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో వెదురు సాగుపై మహిళా రైతులకు అవగాహన సదస్సు రైతు ఉత్పత్తుదారుల సంస్థ(ఎఫ్‌పీవో) మండల అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ దేవరాపల్లిలో మండలంలో ఈ ఏడాది 135 మంది రైతులు వెదురు సాగు చేసేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉండడంతో పాటు 5 ఎకరాల లోపు జిరాయితీ, డీ–పట్టా భూములు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఒక రైతుకు 30 సెంట్లలో సాగు చేసేందుకు అవసరమైన 60 వెదురు మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. 5 కేజీల వర్మీకం పోస్టుతో పాటు మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ ద్వారా పని దినాలు కల్పిస్తామని చెప్పారు. సాగు చేసిన వెదురు ఎక్కడైనా విక్రయించుకునేలా ఫారెస్ట్ సెక్టార్ షిప్ కౌన్సిల్ సర్టిఫికెట్‌ను సదరు రైతులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు గౌరీ శంకర్, అకౌంటెంట్ దేవి, తదితర్లు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట నేడు

దేవరాపల్లి: తెనుగుపూడి శివారు గొల్లపేటలో వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు స్థానిక ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్ట మహోత్సం అనంతరం భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం మహిళల కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శన ఉంటాయన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకరకు సన్మానం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావును సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సుంకర శ్రీనివాసరావు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తారువా క్యాంపు కార్యాలయంలో కలిసి తనకు అప్పగించిన జిల్లా అధికార ప్రతినిధి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసరావును బూడి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాలంపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ చిన్నితో పాటు పార్టీ నాయకులు కె.నానాజీ, ఎ.నాయుడు, పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు

మాకవరపాలెం: రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కిమిటీ సమావేశం నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీకి ఆస్పత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిత్యం రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాదుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సీతారామలక్ష్మి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ మెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణకు హాజరైన పదో తరగతి విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు రాజుగోపాల్, ఎం.నాగేశ్వరరావు, శ్రీరామమూర్తి, మండల కార్యదర్శి జీవీ రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంఎస్ ప్రసాద్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలతో తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమం



పీహెచ్‌సీలో చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు ప్రసవాలు చేసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాలను చేసుకున్న గర్భిణులను మంగళవారం పరిశీలించిన ఆమె పుట్టిన చిన్నారులకు 24 గంటల్లోపు వేసే టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పుట్టిన బిడ్డలకు 24 గంటల్లోగా విటమిన్–కే, హైపటైటిస్–బీ, వోపీవీ, బీసీజీ వ్యాక్సిన్‌లను ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. తద్వారా చిన్నారులకు మంచి ఆరోగ్యంతో పాటు వ్యాధులను ఎదుర్కొనగలిగే శక్తి సమకూరుతుందన్నారు. గర్భిణులకు పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలు జరిగితే రూ.5వేలు చొప్పున ప్రభుత్వ సహాయం అందించనున్నట్లు వైద్యాధికారి శైలజ తెలిపారు. పీహెచ్‌సీలలో 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో గర్భిణులు ఉండడం వల్ల మాతాశిశు మరణాలు జరగకుండా నివారించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ తలారి అప్పారావు

మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ తలారి అప్పారావు కోరారు. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, సూపర్‌వైజర్ పి.చిన్నమ్మ ఆధ్వర్యంలో సత్యవరం సచివాలయ పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా మంగళవారం సత్యవరం–1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి రామారావు, ఉపసర్పంచ్ వొమ్మలి పెంటయ్య, మహిళా పోలీసు నూకరత్నం, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ల జి.జయమ్మ, కె.అనురాధ, ఎం.హైమావతి, ఆయాలు మంత్రి రాజేశ్వరి, పెద్దాడ లక్ష్మి, ఆశా కార్యకర్తలు ఇందిర, సుభద్ర, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ



అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అన్ని విధాలుగా బాగుంటుందని ఐసీడీఎస్ గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ అన్నారు. మండలంలో గన్నవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం 7వ పౌష్టికాహారం పక్షోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ విటమిన్లు ఉండే పౌష్టికాహారం ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 23వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్షోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం, గన్నవరం సెక్టార్ల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు సూచించారు. గాంధీనగరం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కొంత మందికి రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వృద్ధులు, చిన్నారులు ఎండలో తిరగరాదన్నారు. ప్రతి ఒక్కరు మంచినీరు తాగాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులకు పరీక్షలు చేసి, పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే గర్భిణులకు రక్తహీనత సమస్య ఉండదన్నారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలకు స్వస్తి చెప్పి, జాగ్రత్తలు పాటించాలని గర్భిణులకు ఆయన సూచించారు. సర్పంచ్ పాతాళ అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మాడుగులలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సీపట్నం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాలు సంభవించినప్పుడు నివారణ చర్యలపై ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది అగ్ని నిరోధక పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రమాద సమయంలో చేపట్టే విన్యాసాలను క్షేత్రస్థాయిలో చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి, సిబ్బంది, ఆర్టీసీ సిబ్బందితో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో బాధితులను రక్షించడం, మంటలు త్వరితగతిన అదుపులోకి తెచ్చేందుకు అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అప్రమత్తతే అగ్ని ప్రమాదాల నష్టాలను ఎక్కువగా నివారిస్తుందన్నారు.

మాడుగుల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం మాడుగులలో నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. స్థానిక సినిమా హాలు వద్ద ప్రదర్శించిన అగ్నిమాపక విన్యాసాలు అబ్బురపరిచాయి. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ముందుగా స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వి.రాజేశ్వరరావు, ఎల్ఎఫ్ఎస్ రామారావు పాల్గొన్నారు.


రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

మాకవరపాలెం: రోడ్డు భద్రతపై అవంతి కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలు అందరూ పాటించాలన్నారు. ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మద్యం, మాదక ద్రవ్యాలు సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి హరికిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి ఉపాధి హామీ ఏపీవోగా రుక్మిణీదేవి



దేవరాపల్లి: ఉపాధి హామీ పథకం దేవరాపల్లి మండల ఏపీవోగా వై.రుక్మిణీదేవి బాధ్యతలు స్వీకరించారు. చోడవరం నుంచి బదిలీపై వచ్చిన ఆమె గతంలో పెందుర్తిలో ఏపీవోగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఏపీవోగా పనిచేసిన డి.చంద్రకళ చోడవరానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీవో రుక్మిణీదేవి మాట్లాడుతూ జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. మండలంలోని 27 పంచాయతీలలో ప్రస్తుతం 4 వేల మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే దిశగా పక్కా ప్రణాళికతో సమన్వయంతో పని చేస్తామన్నారు.

ఎ.కొత్తపల్లిలో తాగునీటి సమస్యకు పరిష్కారం

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పెద్దన్నవారి, బుగిడి వారి కల్లాలు వద్ద చేతి బోర్ల ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బోరు తవ్వకానికి మంగళవారం స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణతో కలిసి ఆమె భూమి పూజ చేశారు. ఎ.కొత్తపల్లిని దశాబ్దాలుగా వేధిస్తున్న మంచినీటి సమస్యకు తన హయాంలో మోక్షం లభించడం ఆనందంగా ఉందని ఎంపీపీ బుల్లిలక్ష్మీ, సర్పంచ్ సత్య వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు.